# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **హ్యూమన్ మెటానిమో వైరస్-హెచ్ఎంపివిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి నడ్డా వెల్లడించారు.**
2. **హెచ్ఎంపీవీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **తెలంగాణలో ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందిస్తున్నామని రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.**
4. **పుస్తక పఠనం ద్వారా విజ్ఞానంతో పాటు వ్యక్తిత్వ వికాసంపొందవచ్చని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**
5. **ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి సవరించిన ఓటర్ల జాబితాలను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది.**

=========================

హ్యూమన్ మెటానిమో వైరస్-హెచ్ఎంపివిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి నడ్డా వెల్లడించారు. ఈ మేరకు ప్రత్యేక వీడియో సందేశాన్ని ఆయన నిన్న విడుదల చేశారు. ఈ వైరస్ కొత్తదేమీ కాదని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. దేశంలోని ఆరోగ్య వ్యవస్థలు అప్రమత్తంగా ఉన్నాయని చెప్పారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ.. ఆరోగ్యపరమైన సవాళ్లపై స్పందించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..40.. సెకన్లు

---------------------------

ఇతర రాష్ట్రాల్లోహ్యూమన్ మెటానిమో వైరస్- హెచ్ఎంపీవీ కేసులు నమోదైన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వైరస్ వ్యాప్తిపై మంత్రి సత్యకుమార్‌తోపాటు వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో హెచ్ఎంపీవీ అనుమానిత కేసులేవీ నమోదు కాలేదని.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'మాక్‌డ్రిల్' నిర్వహించి.. ఆక్సిజన్ పైపుల పనితీరు ఇతర సదుపాయాలను వినియోగానికి సిద్ధం చేయాలన్నారు. వైరస్

నిర్ధారణకు మూడు వేల పరీక్ష కిట్లను కొనుగోలు చేయాలని, శానిటైజర్లను అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా విశాఖ, అనకాపల్లి జిల్లాలో 2 లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద దేశంలో చేపడుతున్న మొట్ట మొదటి గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్ట్ ఇది. ఎల్లుండి ఒడిషా రాష్ట్రం చేరుకొని 18వ "ప్రవాసీ భారతీయ దివస్"ను ప్రారంభించనున్నారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేశారు. విశాఖపట్నంలో రేపు ప్రధానమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టరు కార్యాలయంలో హోం శాఖ మంత్రి వి. అనితతో కలిసి మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో 90 వేల కోట్ల రూపాయలతో హరిత శక్తి, భారీ ఔషద పరిశ్రమలకు ప్రధానమంత్రి శంఖుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి తెలియజేస్తూ

వాయిస్... 24 సెకన్లు

--------------------------

పుస్తక పఠనం ద్వారా విజ్ఞానంతో పాటు వ్యక్తిత్వ వికాసం పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ క్రీడా మైదానంలో జరుగుతున్న పుస్తక మహోత్సవాన్ని మంత్రి సందర్శించారు. అంతకుముందు సిద్ధార్థ కళాశాల ప్రాంగణం నుండి ఇందిరాగాంధీ స్టేడియం వరకు కొనసాగిన పుస్తక ప్రియుల పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ, డిజిటల్, కంప్యూటర్ విద్య అవసరమే కానీ వాటితో పాటు పుస్తకపఠనం అలవరుచుకోవాలని సూచించారు. పుస్తక మహెూత్సవం వంటి కార్యక్రమాలు ద్వారా యువతకు పుస్తక పఠనంపై ఆసక్తి కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

తెలంగాణలో ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందిస్తున్నామని రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అధునాతన సదుపాయాలతో రూపొందించిన విద్యుత్ బస్సులను హనుమకొండలోని హయగ్రీవచారీ మైదానంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖలతో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ప్రజాపాలనలో ప్రజలకు పెద్దపీట వేసేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ .. 27 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 2025 జనవరి 1 నాటికి తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 4 కోట్ల 14 లక్షల 40 వేల 447గా ఉందని ఎన్నికల సంఘం వెల్లడించింది. వారిలో మహిళా ఓటర్ల సంఖ్య 2 కోట్ల 10 లక్షల 81 వేల 814 ఉండగా పురుష ఓటర్లు 2 కోట్ల 2 లక్షల 88 వేల 543 మంది థర్డ్ జెండర్ ఓటర్లు 3400 ఉన్నారని ఎన్నికల సంఘం తెలిపింది. 18–19 ఏళ్ల మధ్య వయసున్న ఓటర్లు 5 లక్షల 14 వేల 646 మంది ఉండగా రాష్ట్రంలో 46 వేల 397 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే 232 పోలింగ్ కేంద్రాలు పెరిగాయని పేర్కొంది.

---------------------------

తెలంగాణలో సవరించిన ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. జాబితా ప్రకారం.. రాష్ట్రంలో మొత్తంగా 3 కోట్ల 35 లక్షల 27 వేల 925 మంది ఓటర్లు ఉన్నారని తెలిపింది. వీరిలో ఒక కోటి 66 లక్షల 41 వేల 489 మంది పురుషులు, ఒక కోటి 68 లక్షల 67 వేల 735 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 2 వేల 829 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని పేర్కొంది. 18 నుంచి 19 సంవత్సరాల వయసున్న ఓటర్లు 5 లక్షల 45 వేల 26 ఉండగా 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు – 2 లక్షల 22 వేల 91 మంది ఉన్నారని వెల్లడించింది. హైదరాబాద్ జిల్లాలోని శేరిలింగంపల్లిలో అత్యధికంగా 7 లక్షల 65 వేల 982 మంది, అత్యల్పంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో ఒక లక్షా 54 వేల 134 ఓటర్లు ఉన్నారని తెలిపింది.

---------------------------

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డీ కుమార స్వామితో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు శాఖ మంత్రి టీజీ భరత్ నిన్న సమావేశం అయ్యారు. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో ఆర్సెలార్ మిట్టల్‌కు ఇనుప ఖనిజం సరఫరాపై చర్చించామన్నారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం చర్యలతో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకెళ్తోందని అన్నారు. పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెరిగేలా కృషి చేస్తామని టీజీ భరత్ చెప్పారు.

---------------------------

గిరిజన ప్రాంతాల్లో డోలి మోతలు లేకుండా రహదారి సౌకర్యాలను కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం తోణాం పంచాయతీలో 6 లక్షల రూపాయలతో నిర్మించిన కచ్చా రహదారులను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందని అన్నారు. ఆగస్టులో గ్రామ సభ, సెప్టెంబర్ నెలలో పల్లె పండుగ కార్యక్రమం చేపట్టి వంద రోజుల్లోపు రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశామని మంత్రి పేర్కొంటూ...

వాయిస్ 28 సెకన్లు

=====================